

రికార్డుల నిర్వహణ తప్పనిసరి : ఆర్‌టిఐ కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



ప్రభుత్వ కార్యాలయాలలో రికార్డు మేనేజ్ మెంట్ సక్రమంగా నిర్వహించాలని, అప్పుడే పౌరులు కోరిన సమాచారం అందించగలుగుతామని సమాచార కమీషనర్ ఉల్చాల హరిప్రసాద్ రెడ్డి సూచించారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లో సమాచార హక్కు చట్టం క్యాంప్ కోర్టు రెండవ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ వివరిస్తూ మొదటి రోజు నిర్వహించిన 28 కేసులకు గాను 21 ఉత్తర్వులను ఇవ్వడం, మరో మూడు విచారణకు ఆదేశించడం జరిగిందని, మిగిలిన కేసులకు సంబంధించి వాయిదా ఇవ్వడమైనదని తెలిపారు. నేడు 14 కేసులకు సంబంధించి క్యాంప్ కోర్టు నిర్వహణ ఉంటుందని తెలిపారు. కేసుల్లో అధిక శాతం రెవిన్యూ విభాగానికి చెందినవన్నారు.

ఎక్స్‌ప్రెస్ హైవే పనులు పరిశీలన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులను కలెక్టర్ ఎం. హరి నారాయణన్, జాయింట్ కలెక్టర్ ఎస్ .వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ పనులు నిర్వహిస్తున్న వారితో మాట్లాడుతూ ఎక్స్‌ప్రెస్ హైవే ఏ విధంగా వస్తుందని, నిర్మాణాలు ఏ విధంగా చేస్తున్నారని అడిగారు అనంతరం చిత్తూరుకు సంబంధించిన సర్వీస్ రోడ్డు సర్కిల్ ప్రాంతం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారితో మాట్లాడుతూ భూ సమస్యలు దాదాపుగా పూర్తయ్యాయని, ఇక పనులు వేగవంతం చేసుకోవచ్చునని అన్నారు. అదేవిధంగా చెరువులకు సంబంధించిన స్ట్రక్చర్స్ లో మార్పులు లేకుండా చూడాలని అన్నారు. ఇంకా ఏవైనా సమస్యలు భూమికి సంబంధించి ఉంటే జాయింట్ కలెక్టర్ తో సంప్రదించవచ్చునని తెలిపారు. ఎక్స్ప్రెస్ హైవే నిర్మాణం వల్ల చిత్తూరుకి బెంగళూరు నుంచి లేదా చెన్నై నుంచి వచ్చే సమయం భారీగా తగ్గిపోతుందని, నాలుగు ఓవర్పాస్ రోడ్లు, రెండు ఇంటర్ చేంజ్ రోడ్లు వారు కలెక్టర్కు వివరించారు. అదేవిధంగా ఈ ఏడాది మే నెలలో పనులు ప్రారంభించామని, షెడ్యూల్ ప్రకారం 2024 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ వారితో మాట్లాడుతూ విద్యుత్ లైన్లు మార్చే సమయంలో ఎక్కువ సమయం తీసుకోకుండా అన్ని సిద్ధం చేసుకుని లైన్ల మార్పు తీసుకోవాలని రైతులకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ప్రెస్ హైవే కి సంబంధించి సావిత్రి దేవి, ఆర్డీవో రేణుక, తాసిల్దార్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'స్వామిత్ర' సర్వే పారదర్శకంగా చేపట్టాలి

గహ నిర్మాణదారులకు సంబంధించిన భూ హక్కులను కల్పించేందుకు స్వామిత్వ సర్వే నిర్వహించబడుతుందని, దీనికి అందరూ సహకరించాలని, సిబ్బంది నిష్పక్షపాతంగా ఈ సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఎం. హరి నారాయణన్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ఎస్ .వెంకటేశ్వర్ తో కలసి గుడిపాల మండలంలోని పాపసముద్రంలో స్వామిత్వ రీ సర్వే కార్యక్రమాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఓ ఆర్ ఐ షీట్లు వచ్చిన తర్వాత సర్వే కార్యక్రమాలు ఏ విధంగా నిర్వహిస్తున్నారు? అందుకు తగిన విధానం ఎటువంటిది? అని సిబ్బందిని అడిగారు. ఈ కార్యక్రమంలో ఏడి సర్వే కనక ప్రసాద్, ఆర్డిఓ రేణుక, డిపిఓ లక్ష్మి, తాసిల్దారు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

గృహనిర్మాణాలను వేగవంతం చేయండి

రాష్ట్ర ప్రభుత్వం గహ నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వేగవంతంగా గహ నిర్మాణాలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అన్నారు. చిత్తూరు నగరపాలక పరిధిలోని అనుప్పల్లి గహ నిర్మాణాల సముదాయమును జిల్లా కలెక్టర్ శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, నగరపాలిక కమిషనర్ అంజలితో మాట్లాడుతూ గహ నిర్మాణాలు వేగవంతంగా చేసి లబ్ధిదారులకు అందించాలన్నారు.



ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం : జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్



జిల్లాలో ప్రకతి వ్యవసాయం సాగును మరింత ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టాలని జెడ్పి చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో నిర్వహించగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన జెడ్పి చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో ప్రకతి వ్యవసాయం సాగును ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.. వేరుశనగ, చిరుధాన్యాల విత్తనాలను ప్రతి ఆర్బికే లలో అందుబాటులో ఉంచేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో నీరు పుష్కలంగా ఉందని, హార్టికల్చర్ పంటలు బాగా పండించడం జరుగుతోందని, దీనితో పాటు కాయగూరలు పండించడం, చిరుధాన్యాల పంట సాగును ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేందుకు రైతులకు మరింత అవగాహన పెంచాలని సూచించారు. జిల్లా కలెక్టర్ యం. హరి నారాయణన్ మాట్లాడుతూ జిల్లాలో రబీ సాగు విస్తీర్ణం అన్ని పంటలతో కలిపి 48,746 హెక్టార్లు కలదని, ఇప్పటి వరకు 1,916 హెక్టార్లు సాగు అవుతున్నదని, గత సంవత్సరం ఇదే సమయానికి జిల్లాలో 834 హెక్టార్లలో సాగు కావడం జరిగిందని, ఈ సంవత్సరం రబీ సీజన్ ఆశాజనకంగా ఉన్నప్పటికీ సాగు విస్తీర్ణాన్ని పెంచాల్సిన అవసరం కలదని, ఇందుకు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉండేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో గల మామిడి గుజ్జు పరిశ్రమల వివరాలను ప్రతి ఆర్బికే పరిధిలో ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారిని ఆదేశించారు. రైతులకుఅవసరమైన వర్మీ కంపోస్ట్ చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలలో అవసరమైన మేరకు అందుబాటులోకలదని తెలిపారు. డి ఆర్ ఓ ఎన్. రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ రైతాంగానికి సత్వర సేవలు అందించేందుకు ఏర్పాటైన ఆర్ బి కె లు రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు సూచనలు అందివ్వాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళి కష్ణ మాట్లాడుతూ గత జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో చర్చించిన అంశాలలో సభ్యులు తలెత్తిన అంశాల్లో భాగంగా గ్రామాలలో మామిడి సాగు చేయు రైతులకు ప్రకతి వ్యవసాయ సాగు పై అవగాహన కల్పించాలని కోరడం జరిగిందని, ఇందుకు గానూ ఆర్ వై ఎస్ ఎస్ గుంటూరు వారు చిత్తూరు జిల్లాలో మామిడి సాగు చేయు రైతులకు ప్రకతి వ్యవసాయ సాగు చేసే అంశం పై అవగాహన కల్పించుటకు అంగీకరించారన్నారు. ఈ సమావేశం లో పలమనేరు- కుప్పం- మదనపల్లి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఇరిగేషన్ ఎస్ ఈ విజయ కుమార్ రెడ్డి, ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ సంపత్ కుమార్, పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ శేషగిరిరావు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను మదింపులో అక్రమాలు

ఆర్ఐ, ఇద్దరు అడ్మిన్ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలో రెండు బహుళ అంతస్తుల భవనాలకు సంబంధించి ఆస్తిపన్ను మదింపులో అక్రమాలు చోటు చేసుకోవడంతో నగరపాలక సంస్థ చెందిన రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎస్.దొరై రాజ్, అడ్మిన్ కార్యదర్శులు మౌనిక, కిశోర్ కుమార్ నగరపాలక కమిషనర్ డా. జె అరుణ సస్పెండ్ చేశారు. తనిఖీల్లో భాగంగా శుక్రవారం నగర కమిషనర్ డా.జె అరుణ, అసిస్టెంట్ కలెక్టర్ వై. మేఘస్వరూప్ లు 39, 42 వార్డు సచివాలయాల పరిధిలో రెండు బహుళ అంతస్తుల భవనాల ఆస్తిపన్ను రికార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో భవన నిర్మాణాలు, అంతస్థులు, రికార్డుల్లో ఉన్న వాటికి భారీగా వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. ఇదే సమయంలో ప్రభుత్వం ఇటీవల ఆస్తి పన్నులను మూలధన ఆధారితంగా లెక్కించే విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఈ విధానంలో బహుళ దుస్తుల భవనాలకు సంబంధించి సరైన కొలతలు, అంతస్థులు నమోదు చేయకపోవడం కారణంగా నగరపాలక సంస్థకు భారీగా ఆర్థికంగా నష్టం చేకూరినట్లు తనిఖీల్లో గుర్తించారు. ఈ అంశంపై సమగ్ర దర్యాప్తు, అందిన నివేదికల మేరకు సంబంధించిన రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎస్.దొరై రాజ్, 39, 42 వార్డుల అడ్మిన్ కార్యదర్శులు మౌనిక, కిశోర్ కుమార్ లను సస్పెండ్ చేస్తూ, మరో ఆర్ఐ అమర్నాథ్ రెడ్డి కి షోకాజ్ నోటీసు జారీ చేస్తూ శుక్రవారం రాత్రి కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. నగరపాలక సంస్థకు నష్టం కలిగేలా ఏ అధికారి, సిబ్బంది వ్యవహరించిన చర్యలు కఠినంగా ఉంటాయని ఈ సందర్భంగా కమిషనర్ హెచ్చరించారు. ఆస్తి పన్ను మదింపు, వసూళ్ల విషయంలో పదేపదే మార్గ నిర్దేశం చేస్తున్నా విధుల్లో నిర్లక్ష్యం వద్దన్నారు. క్రమం తప్పకుండా తనిఖీ ఉంటాయని, అక్రమాలు గుర్తిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్వీయూలో గందరగోళంగా పీజీ కౌన్సిలింగ్

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని వివిధ కళాశాల ఆధ్వర్యంలో పీజీ సెట్ కౌన్సిలింగ్ సర్టిఫికెట్ పరిశీలన గురువారం నుంచి ప్రారంభమైంది. విద్యార్థుల సర్టిఫికెట్ పరిశీలన కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి కనీస సదుపాయాలు గాని, సలహాలు, సూచనలు కానీ సరిగా ఇవ్వకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎస్వీయూలో ఆర్ట్స్, సైన్స్, మేనేజ్మెంట్ కళాశాల ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్యంగా సైన్స్ కళాశాలలోని వివిధ కోర్సులలో చేరేందుకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో సర్టిఫికెట్ పరిశీలనకు హాజరయ్యారు. సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో దాదాపుగా 20 కోర్సులకు పైగా విద్యార్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవడానికి హాజరయ్యారు. అయితే సిబ్బంది కొరత, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడ్డారు. విద్యార్థులకు తాగునీటి సదుపాయం కూడా కల్పించకపోవడం అలాగే సరైన సమాచారం అందించలేకపోవడం పెద్ద సంఖ్యలో వచ్చిన విద్యార్థుల సంఖ్యను క్రమ పద్ధతిలో పిలువకపోవడం కూడా అధికారుల వైఫల్యంగా కనిపించింది. ఉదయం 9:30 గంటలకు వచ్చిన విద్యార్థి సాయంత్రం ఏడు గంటల అవుతున్న కూడా సర్టిఫికెట్ పరిశీలన పూర్తి కాకపోవడంతో తీవ్ర నిరాశ నిర్వేదంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. సమయం రేపటి వరకే ఉండటంతో విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. ఉన్నత విద్య మండలి సైతం విద్యార్థులకు అర్ధరాత్రి సమయంలో సీట్ కేటాయించడం, సీట్ జాయినింగ్ రిపోర్టు కనీసం ఒక్కరోజు, రెండు రోజులు కూడా గడువు ఇవ్వకపోవడం పట్ల విద్యార్థి సంఘాలు భగ్గుమంటున్నాయి. విద్యార్థులు జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వడానికి కనీసం వారం రోజులైనా సమయం ఇవ్వాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థులకు పెద్ద కమిటీ హాల్లో కానీ, శ్రీనివాస్ ఆడిటోరియంలో కానీ కౌన్సిలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఉంటే విద్యార్థులకు అన్ని రకాలుగా అన్ని విధాలుగా సౌకర్యవంతంగా ఉండేదని విద్యార్థి సంఘాల నాయకులు భావిస్తున్నారు. ఇప్పటికైనా విద్యార్థుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, ముందు సూచనతో సర్టిఫికెట్ పరిశీలన గడువును పొడిగించాలని, అలాగే సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ పూర్తిస్థాయిలో విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలనలో సమయాభావం లేకుండా చూసుకొని తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

విద్యార్థులకు సమయం ఇవ్వని ఉన్నత విద్యా మండలి





ఎపిఎస్పిడిసిఎల్‌కు రెండు జాతీయ అవార్డులు


ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలతో నిరంతర విద్యుత్తును సరఫరా చేస్తున్న ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎపిఎస్ పిడిసిఎల్)కు రెండు జాతీయ స్థాయి అవార్డులు లభించాయి. ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసిసి) ఆధ్వర్యంలో న్యూ ఢిల్లీలో శుక్రవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎపిఎస్ పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు ఈ అవార్డులను అందుకున్నారు. ఢిల్లీలోని ఇండియా హ్యాబిటేట్ సెంటర్లో ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 18వతేదీ వరకు 16వ ఇంధన సదస్సును నిర్వహించారు. ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు అందిస్తున్న నాణ్యమైన సేవలు, వినియోగదారుల సాధికారత అంశంలో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలోనూ, అలాగే సంస్థ పనితీరు మెరుగుదల అంశంలో కూడా జాతీయ స్థాయిలో ఎపిఎస్ పిడిసిఎల్ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఈ సదస్సు తీర్మానించింది.

ఎలమంచిలి ప్రవీణ్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

మెక్లారిన్ 176 వ జన్మదిన వేడుక సంద్భంగా ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్‌ను ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వించారు. ఈ కార్యక్రమంలో పలు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే దాదాపు నలుగురు పాస్టర్లకి రెవరెండ్ ఇవ్వడం జరిగింది. సుందర్రావు ,రెవరెండ్ ,యాకోబు, ఎవరం డేవిడ్, రెవరెండ్ ఈజ్కియా రాజు లకు బిషప్ హోదా ఇచ్చి ఆర్డినేషన్ చేశారు.



తెలుగు పుస్తకాల ప్రదర్శన

చిత్తూరు అర్బన్: స్థానిక వేలూరు రోడ్డులోని సావిత్రమ్మ ప్రభుత్వం మహిళా కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం తెలుగు పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్ సందర్శించి మాట్లాడుతూ తెలుగు విభాగం అధ్యాపకులు ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందదాయకం అన్నారు. విద్యార్థుల్లో పఠనా శక్తి పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడతాయని సూచించారు. తెలుగు శాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ ఉషారాణి మాట్లాడుతూ విద్యార్థులు తమ పాఠ్య అంశాలను సంబంధించిన పుస్తకాలే కాకుండా ఇతర పుస్తకాలను చదవడం వల్ల విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఒక పుస్తకం 100 మంది స్నేహితులతో సమానమని, మన కళాశాల గ్రంథాలయాల్లో ఉన్న ఎన్నో పుస్తకాలు విద్యార్థులకు పోటీ పరీక్షల్లో ఉపయోగపడతాయన్నారు. తెలుగు అధ్యాపకులు సజనీ మాట్లాడుతూ ఈ పుస్తక ప్రదర్శన లో వెయ్యికి పైగా పుస్తకాలను తెలుగు గ్రంథాలను ప్రదర్శించామని తెలిపారు. విద్యార్థులు వీలున్నప్పుడల్లా వచ్చి ఈ పుస్తకాలను చదివి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జువాలజీ శాఖ అధ్యక్షులు ఆనంద్ పాల్గొన్నారు.



'హౌసింగ్'కు అదనంగా రుణాలు

చిత్తూరుఅర్బన్ : ఇల్లు నిర్మించుకునే హౌసింగ్ లబ్ధిదారులకు డ్వాక్రా సంఘాల నుంచి అదనంగా రుణాలు మంజూరు చేయాలని నగర కమిషనర్ డా. జె అరుణ మెప్మా సీవోలను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం నగరపాలక కార్యాలయంలో మెప్మా సిఓలు, హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే పునాదులు పూర్తి చేసుకున్న వారికి అదనంగా రుణాలు ఇవ్వాలని, ఇంకా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని వారికి... సంఘాల్లో లేకపోయినా, సంఘాల్లో సభ్యత్వం నమోదు చేయించి రుణాలు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్లో పక్కా గహప్రవేశాలు నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఇళ్లన్నీ వేగంగా పూర్తి చేయించేలా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ శ్రీధర్, సీవోలు పాల్గొన్నారు.



మాజీ టౌన్‌బ్యాంకు చైర్మన్‌కు పరామర్శ

చిత్తూరు అర్బన్ : గురువారం ఉదయం తీవ్ర అస్వస్థతతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్ పి షణ్ముగంను చిత్తూరు టిడిపి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాజూరు బాలాజీ పరామర్శించారు. వారితో పాటు నగర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి నవాజ్ బాషా. సీనియర్ మైనార్టీ నాయకులు జాఫర్, నగర తెలుగు యువత ఉపాధ్యక్షుడు హేమరాజు తదితరులున్నారు.

మైనార్టీ కుటుంబానికి ఆర్థిక సాయం

చిత్తూరుఅర్బన్: తెలుగుదేశం పార్టీ నాయకుడిగా ఎనలేని సేవలు అందించిన జాంగిర్ కుటుంబానికి తన వంతు సహాయంగా కాజూరు బాలాజీ 25వేల రూపాయల చెక్కును అందించారు.

సొసైటీ భూములను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - కుప్పం

మున్సిపాలిటీ పరిధిలోని సొసైటీ భూములను కాపాడుకోడానికి ప్రాణాలైనా అర్పిస్తామని టేలర్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం వెల్లడించింది. విలేకరులతో వారు మాట్లాడుతూ టెలర్ హైస్కూలుకు సంబంధించిన భూములను కబ్జాకు పాల్పడటాన్ని వారు ఖండించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సురేష్, ప్రెసిడెంట్ మురళీమోహన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జనార్ధన్‌రెడ్డి, మాదేష్, కార్యదర్శి హఫిజ్ని పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో టెలర్ కాన్వెంట్ విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకుని విదేశాల్లో సైతం ఉద్యోగం చేసుకుంటూ స్థిరపడ్డారన్నారు ఇంతటి విశిష్టత కలిగిన సంస్థ యాజమాన్యం అనివార్య కారణాల వల్ల విద్యాసంస్థను మూసివేశారని, అయితే దాదాపు 13 ఎకరాల భూమిని ఆక్రమించేందుకు పూనుకుంటున్నారన్నారు. భూముల కోసం న్యాయపోరాటానికైనా సిద్ధమన్నారు.





చెకుముకిలో పిఈఎస్ విద్యార్థుల ప్రతిభ

చిత్తూరుఅర్బన్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించే చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షను శుక్రవారం యాదమరి మండలంలో నిర్వహించారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల తరఫున ఐదు టీములు, ప్రైవేటు పాఠశాలల తరఫున మూడు టీములు పాల్గొన్నాయి .పై టీముల్లో ప్రైవేట్ పాఠశాలల్లో పి ఈ ఎస్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు శశికాంత్ –ఎనిమిదో తరగతి, పి. జాహ్నవి– 9వ తరగతి ,రోషిని– పదవ తరగతి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. యాదమరి మండల ఎంఈఓ రుక్మిణి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. లక్ష్యాన్ని ఎంచుకొని చదివితే సాధించలేనిది అంటూ ఏదీ లేదని తెలియజేస్తూ, బహుమతులను సొంతం చేసుకున్న విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను పి ఈ ఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ వై.వి.కష్ణ బాబు అభినందించారు.

'క్రెస్ట్'ఫౌండేషన్‌తో మహిళా వర్సిటీ ఒప్పందం

ప్రజాశక్తి - క్యాంపస్



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం క్లైమేట్ ఆక్షన్ అకాడమీ ఆఫ్ క్రెస్ట్ పౌండేషన్ , హైదరాబాద్ తో అవగాహన ఒప్పందం (ఎం వో యూ) చేసుకుంది. ఈ మేరకు ఎస్.పి.ఎం.వి.వి అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ లో రెండు సంస్థల ప్రతినిధులు సంతకం చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున మాట్లాడుతూ ఎం.వో.యు యొక్క ప్రధాన ఉద్దేశ్యం ఒకరికొకరు పరస్పర సహకారం అందించుకోవడం, సర్టిఫికెట్ కోర్స్ ఆఫర్ చేయటం, విద్యార్థినులకు ఇంటర్న్షిప్ ఇవ్వడం, వాతావరణ మార్పుల గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేయటం, సెమినార్లు వర్క్‌షాపులు నిర్వహించడం. యుఎన్ఓ వారి ఎస్.డి.జి లను గ్రామాలను దత్తత తీసుకొని, ఈ ఎస్.డి.జి లను ఆచరణ లోకి తీసుకుని రావటం, పుడమి మాతను కాపాడే దానికి సంయుక్త కార్యాచరణ వంటి కార్యక్రమాలు చేయటం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లైమేట్ ఆక్షన్ అకాడమీ ఆఫ్ క్రెస్ట్ పౌండేషన్ హెడ్ ఎం. ఇందిర దాస్ పాల్గొన్నారు.

క్యాంపస్ పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - క్యాంపస్ శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ క్యాంపస్ పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల గ్రంథాలయంలో సుమారు పదివేల పుస్తకములు అందుబాటులో ఉన్నాయి. పెద్ద బాలశిక్ష, రామాయణం, మహాభారతం, విద్యార్థులు పాఠ్యాంశాలకు సంబంధించినటువంటి పుస్తకములు, ఎన్సైక్లోపీడియా, వివిధ రకాల పోటీ పరీక్షలకు సంబంధించినటువంటి పుస్తకములు పొందుపరచబడ్డాయని ప్రధానోపాధ్యాయులు షకీనమ్మ వెల్లడించారు. ఈ సందర్భంగా షకీనమ్మ మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంచుకోవాలని పేర్కొన్నారు. పుస్తక పఠనం వలన విద్యార్థులకు మేధో శక్తి పెరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.వి.రాజు, అరుణ, ప్రసాద్, హరి, విద్యార్థులు పాల్గొన్నారు.

దారి సమస్య పరిష్కరించాలి

ఎమ్మెల్యేకు సాయి నగర్ గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం : దారి సమస్యను పరిష్కరించాలని పూతలపట్టు శాసనసభ్యులు ఎమ్మెస్ బాబుకు బంగారుపాలెం మండలం తగ్గువారిపల్లి పంచాయతీ సాయి నగర్ కాలనీ ప్రజలు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరగొండ రోడ్డు నుండి సాయి నగర్‌కు వెళ్లే దారిలో దారి మొత్తం బుడదమాయంగా తయారై నడవడానికి కూడా వీలు లేకుండా ఉందని గత సంవత్సరపు సీసీ రోడ్లు మరమ్మతులు చేస్తున్నట్టు ఎమ్మెల్యే చేతుల మీదుగా భూమి పూజ చేయించారు. కానీ ఇంతవరకు దానిపై చర్యలు చేపట్టలేదని సాయినగర్ గ్రామ స్తులు వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు, పిఆర్ఏఈ గురవారెడ్డికి సమస్యను పరిష్కరించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో వైసీపీ శిరీష్ రెడ్డి, గ్రామస్తులు లక్ష్మీ ప్రసన్న కుమార్, కృష్ణ, జయమ్మ, వహీదా, ధనలక్ష్మి, గణేష్ నాయుడు, మహదేవ నాయుడు, హేమావతి, గోపి, రేణుక పాల్గొన్నారు.

ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి


రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

ప్రజాశక్తి- ఐరాల: సచివాలయాలకు వచ్చే సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలని జిల్లా పరిషత్ సీఈఓ ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఐరాల మండలంలోని కాణిపాకం గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయంలో పలు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అందుబాటులో వున్న గ్రామ సచివాలయ సిబ్బందితో అభివృద్ధి పనులపై సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు గ్రామ సచివాలయంలో స్పందన కార్యక్రమం, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలపై వచ్చు అర్జీలపై, సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ పరిధిలోని గ్రామంలో పరిశుభ్రత పాటించి, వాటర్ ట్యాంక్‌లను క్లీన్ చేసి, అంటువ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని సచివాలయ సిబ్బందికి జెడ్పీ సీఈఓ కోరారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయానికి భూమి పూజ



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని పాలేరు పంచాయితీ శేషాపురం గ్రామంలో శ్రీవాణి ట్రస్ట్, సమరత సత సేవా ఫౌండేషన్ నిర్మిస్తున్న గంగమ్మ దేవాలయానికి భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా ధర్మప్రచారక్ నారాయణ స్వామి మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో ప్రాచీనాలయాలు, నూతన ఆలయాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తారని అన్నారు. గ్రామాల్లోని వారు కమిటీగా ఏర్పాటు చేసి నివేదిక సమర్పించినప్పుడు వారికి నిర్మాణాలకు అయ్యే ఖర్చు తిరుపతి తిరుమల దేవస్థానం వారు చేపడతారన్నారు. వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మి ప్రసాద్ రెడ్డి, జిల్లా సహ కన్వినర్ శ్రీరాములు రెడ్డి, ధర్మ ప్రచారక్ పద్మనాభం, మండల కన్వీనర్ అర్జునయ్య, గురునాథ మాజీ సర్పంచి విజయ్ కుమార్, గ్రామస్తులు జానకి రామా నాయుడు, నాగేశ్వర రావు నాయుడు, త్యాగరాజు నాయుడు మురళి నాయుడు, రవినాయుడు, పలువురు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంభంపల్లి ఇంటివద్దకే ఆరోగ్య సేవలు



ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి : మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కంభంపల్లి గ్రామంలో డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఉదయం 9 గంటల నుండి ఓపి సేవలు సాయంత్రం 4 గంటల వరకు లెప్రసీ, నిమోనియా పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రం, పాఠశాల పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం జరిగింది. టీబీ వ్యాధికి చికిత్స తీసుకుంటున్న వారిని పరామర్శించి సలహాలు సూచనలు అందజేశారు. అలాగే చిరువ్యాధుల చికిత్స, గర్భిణులకు, బాలింతలకు కౌమర బాలబాలికలకు, వృద్ధులకు రక్తపోటు, మధుమేహం వ్యాధి గ్రస్తులకు వైద్యం అందించారు. ఈ విధంగా నిర్దేశించిన రోజుల్లో గ్రామంలో గల ప్రతి కుటుంబానికి మెరుగైన వైద్య సేవలు వారి గ్రామంలోనే అందించబడునని డాక్టర్ పద్మావతి తెలియజేశారు. ఏ. శ్రీదేవి హెల్త్ ఎడ్యుకేటర్, ఎంఎల్‌హెచ్‌పి నవీన. కవిత ఏఎన్ఎం, రామాంజమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆంధ్రుల రాజధాని అమరావతి

వాణిజ్య విభాగం అధ్యక్షులు వంశీకృష్ణ



ప్రజాశక్తి - బంగారుపాళ్యం: ఆంధ్రుల రాజధాని అమరావతి అని వాణిజ్య విభాగం అధ్యక్షులు వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం తెలుగుదేశం కార్యాలయంలో సమావేశం జరిగింది. వైయస్సార్ పార్టీ మూడు రాజధానుల నినాదాలతో ర్యాలీ చేపట్టడం బాధాకరమని అన్నారు. ఆంధ్రుల రాజధాని అమరావతి అని ప్రజలు ముక్త కంఠంతో అంటున్నా అధికార పార్టీకి పట్టడం లేదని మూడు రాజధానులు విధానాన్ని మానుకొని అమరావతిని నిర్మించాలన్నారు. మాజీ సింగల్ విండో అధ్యక్షులు హేమచంద్ర నాయుడు, తెలుగుదేశం మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్ గౌడ్ తెలుగునాడు గీత కార్మిక అధ్యక్షులు నాగరాజు, యువత అధ్యక్షులు రమేష్, రైతు విభాగం రాజేంద్రనాయుడు, నియోజకవర్గ మైనారిటీ జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

దళిత సమరభేరి విజయవంతం చేయండి



ప్రజాశక్తి-పూతలపట్టు : దళిత సమరభేరిని విజయవంతం చేయాలని పూతలపట్టు మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షతన దొరబాబు చౌదరి సమావేశం నిర్వహించారు. గతంలో తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న 27 పథకాలు పూర్తిగా వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడం, ఎస్సీ, ఎస్టీ నిధుల నిర్వీర్యం చేశారని తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తిరుపతిలో దళిత హక్కుల కాపాడుకోవడం కోసం ఈ నెల 24వ తేదిన దళిత సమరభేరి విజయవంతం చేయాలన్నారు. ఐరాల మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు గిరిధర్ బాబు, తవణంపల్లి మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు గాలి దిలీప్ కుమార్, మాజీ జెడ్పిటిసి సభ్యులు వెంకటేశ్వర చౌదరి, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు కోదండయ్య, రాష్ట్ర సాంస్కృతిక విభాగం ఉపాధ్యక్షులు మణి నాయుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ఆనగల్లు మునిరత్నం, రాష్ట్ర తెలుగు యువత మండల తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పెద్దపాళ్యం నాగేంద్రబాబు, రబీ, మాజీ ఎం.పీ.టి.సీ నటరాజు, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సైన్స్ పరిజ్ఞానంతోనే దేశాభివృద్ధి


పెద్దపంజానిలో..

ప్రజాశక్తి - పెద్దపంజాణి: సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలను రూపు మాపడానికి విజ్ఞాన శాస్త్రం ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని, సైన్స్ పరిజ్ఞానంతోనే సమాజం దేశం అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ రెడ్డెప్ప అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు జెడ్పీటీసీ సుష్మా కీర్తి బహుమతులు ప్రదానం చేశారు.

ఎస్ఆర్‌పురం: విద్యార్థులలో నైపుణ్యం వెలికి తీసి సృజనాత్మకత పెంచుకోవడానికి చెకుముకి పరీక్షలు దోహదం చేస్తాయని మండల జెవివి ప్రధాన కార్యదర్శి షణ్ముగం తెలిపారు. మండల కేంద్రమైన ఎస్ఆర్‌పురం ఎంఆర్సి కేంద్రంలో నిర్వహించిన చెకుముకి పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులు వచ్చే నెల 11వ తేదీ జరిగే జిల్లాస్థాయి పరీక్షలకు ఎంపికయ్యారని తెలిపారు.

గుడిపల్లి: మండలంలోని జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన సంబరాలలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు మండల స్థాయిలో ప్రతిభ కనబరిచారు. తదుపరి జిల్లా స్థాయిలో జన విజ్ఞాన వేదిక వారు నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ భువనేశ్వరి విద్యార్థులను ప్రశంసించారు.

పుంగనూరు: జన విజ్ఞాన వేదిక సామాన్య ప్రజలను చైతన్యవంతం చేస్తుందని ఇది ఒక సైన్స్ సమాచార సంస్థ అని జేవివి పట్టణ కార్యదర్శి బిల్లా రామలింగప్ప అన్నారు. మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ స్థానిక నాగపాలెంలోని మున్సిపల్ లినార్డ్ హైస్కూల్‌లో గురువారం జరిగింది. ప్రభుత్వ స్కూలు నుండి పట్టణంలోని బాలికల హై స్కూల్, ప్రైవేటు పాఠశాల నుండి కృష్ణారెడ్డి చైతన్య స్కూల్ టీములు జిల్లా పోటీలకు ఎన్నిక కావడం జరిగిందన్నారు.


ఎస్ఆర్‌పురంలో..

వెదురుకుప్పం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. మండల స్థాయిలో పాల్గొన్న విద్యార్థులకు, విజేతలకు పాతగుంట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.చాముండేశ్వరి సర్టిఫికెట్స్, మెడల్స్ ప్రదానం చేశారు.

సోమల : మండల కేంద్రమైన సోమల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలలో కందూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయినట్టు ప్రధానోపాధ్యాయురాలు శివ రత్నమ్మ తెలిపారు.

పులిచెర్ల: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కల్లూరులో మండల స్థాయి చెకుముకి పోటీలను 'జన విజ్ఞాన వేదిక 'చిత్తూరు జిల్లా హెల్త్ సబ్ కమిటీ కన్వీనర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోకల తాతయ్య తెలిపారు. ఈ పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులు జిల్లాస్థాయి చెకుముకి పరీక్షకు అర్హత సాధించారని తెలిపారు. పోటీ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులందరికీ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.


బైరెడ్డిపల్లిలో..

పాలసముద్రం: విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించే ఉద్దేశంతోనే ఈ చెకుముకి పోటీలు నిర్వహించామని విజ్ఞాన వేదిక ప్రోగ్రాం ఆఫీసర్ మురుగుదాస్ తెలిపారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు నిర్వహించారు. మొదటి స్థానం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిరుమలరాజుపురం విద్యార్థులు గెలుపొందారు. జిల్లా స్థాయికి అరుణోదయ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ప్రభుత్వ, ప్రైవేటుకు చెందిన మొత్తం13 పాఠశాలలు విద్యార్థులకు రెండు విభాగాలుగా చెకుముకి పరీక్షలు నిర్వహించారు. సత్తాచాటిన విద్యార్థులకు ఎం.ఈ.ఓ. సాయిలీల అభినంధించి బహుమతులు అందజేశారు. ప్రథమస్థానం దక్కించుకున్న విద్యార్థులు డిసెంబర్ 10,11 తేదీల్లో జరిగే జిల్లా స్థాయి చెకుముకి పరీక్షల్లో పాల్గొంటారని తెలిపారు.

పలమనేరు: పలమనేరు మండలంలోని విద్యార్థులకు పలమ నేరు ఎల్ఐసి ఆఫీస్‌పైన వీఎన్ఆర్ కాంప్లెక్స్ లో జె.వి.వి. ఆధ్వర్యంలో చెకుముకి పరీక్షను నిర్వహించింది. స్టేట్ ఉపాధ్యక్షులు యుగంధర్ బాబు మాట్లాడుతూ విజ్ఞానవంతులుగా మారడమే చదువు లక్ష్యమన్నారు. జెవి.వి పట్టణ ప్రధాన కార్యదర్శి కె. సుదర్శనాచారి మాట్లాడుతూ చెకు ముకి పరీక్షల్లో విద్యార్థుల్లో చైతన్యం, టీమ్ స్పిరిట్ పెరుగుతుందన్నారు. గంగవరం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విజేతలకు సిరిపురం సీతారామయ్య మెడల్స్, జె.వి.వి పుస్తకాలను బహుమతులు అందిస్తారు.

సంక్షేమం, అభివృద్ధి జగనన్నకు రెండు కళ్ళు

డిప్యూటీ సీఎం నారాయణస్వామి



ప్రజాశక్తి - ఎస్ఆర్‌పురం: సంక్షేమం అభివృద్ధి జగనన్నకు రెండు కళ్ళు లాంటివని నవరత్నాలు ప్రజల జీవనాడి అని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వెంకటాపురం సచివాలయం పరిధిలో గల వెంకటాపురం పంచాయతీ ఉడుములకుర్తి పంచాయతీ, గ్రామాల్లో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి లబ్ధి దారులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కరించడానికి ఈ కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తుందని అన్నారు. వెంకటాపురం గ్రామస్తులు తమ సమస్యను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం ఈ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. నెల రోజుల్లో తిరిగి ఈ గ్రామాన్ని సందర్శిస్తానని పనుల్లో పురోగతి సాధించుకుంటే అధికారులపై చర్యలు తప్పవు అన్నారు. పొదలపల్లి గ్రామానికి కమ్యూనిటీ భవనం, ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు టీటీడీ తరపున విడుదల చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమానికి ఏపీ ఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి, జెడ్పిటిసి రమణ ప్రసాద్ రెడ్డి, డిసిసిబి బ్యాంక్ డైరెక్టర్ బాల సుబ్రహ్మణ్యం రెడ్డి, మండల అధ్యక్షులు అనంతరెడ్డి, స్థానిక సర్పంచులు విజయ, చిట్టి, ఎంపీటీసీ ఏసమ్మ, మాజీ జెడ్పిటిసి గురువారెడ్డి, మాజీ ఎంపీపీ రవి వర్మ, తాసిల్దార్ సబీర్ భాష, ఎంపీడీవో కృష్ణయ్య, నాయకులు కాలప్ప ,జనార్ధన్, మణి, మహేష్, ఏకాంబరం, చిరంజీవి రెడ్డి, గోవిందయ్య, భూపతి రెడ్డి, ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి- రామకుప్పం: మండల పరిధిలోని గత కొన్ని సంవత్సరాలుగా పరిష్కారం కాకుండా మిగిలిపోయిన ఎస్సీ, ఎస్టీ వర్గాల వారి సమస్యలను త్వరితగతిన పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని రామకుప్పం మండల ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జెడ్పిటిసి నితిన్ రాఘవరెడ్డిలు మండల అధికారులను కోరారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో రామకుప్పం మండలం ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం తహశీల్దార్ సురేంద్రబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మానిటరింగ్ కమిటీ సభ్యులు పలు అంశాలను లేవనెత్తుతూ మండలంలో పలు శాఖలకు చెందిన అధికారులు ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారానికి చొరవ చూపకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. మానిటరింగ్ కమిటీ సమావేశాలకు హాజరు కాక డుమ్మా కొడుతున్నారని, అలాంటి వారి పట్ల చర్యలు తీసుకోవాలని కోరారు. రామకుప్పం మండల కేంద్రంలో అంబేద్కర్, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాల వద్ద ఉన్న సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఇలాంటి సమావేశాలకు ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవటం బాధాకరమని సర్పంచ్ మోహన్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఉమామహేశ్వర్ రెడ్డి, వైకాపా కన్వీనర్ విజిలాపురం బాబు రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాధాకృష్ణ, మండల సర్పంచ్ల సంఘం ప్రధాన కార్యదర్శి రాజగోపాల్, పలువురు ప్రజా ప్రతినిధులు సభ్యులు వెంకటేష్, నారాయణస్వామి, బాస్ సతీష్, నవీన్, భాస్కర్, పెనువేలు సింహ, జనసేన హరీష్, ఆంజనేయప్ప, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోని వ్యర్థాలను తొలగించాలి :ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు



ప్రజాశక్తి -బంగారుపాళ్యం: గ్రామాల్లోని వ్యర్థాలను తొలగించాలని పూతలపట్టు శాసనసభ్యులు ఎమ్మెస్ బాబు అన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలో ఎంపీపీ అమరావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మొదట శాఖా పరంగా చేపట్టిన పనులు నివేదికలను మండల అధికారులు నివేదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు మాట్లాడుతూ గ్రామాల్లోని ఇండ్లకు సమూదాయాల్లో పేడ దిబ్బలు, మురికి కాలవల్లో వ్యర్థాలు తొలగించడం లేదన్నారు. గ్రామాల్లో వేసిన సీసీ రోడ్లపై పాడి పశువులను కట్టి ఉంచడం వలన దుర్వాసన వెదజల్లుతుందని దీనిపై పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు స్థానిక సమస్యలపై అవగాహనతో రావాలని సమస్యలపై సంబంధిత అధికారులు అడిగి సమస్యలను పరిష్కరించి రాబోవు మండల సర్వ సమావేశానికి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జయకుమార్, జెడ్పిటిసి సోమశేఖర్, సింగల్ విండో ఛైర్మన్, దత్త రెడ్డి, తహశీల్దార్ బెన్‌రాజ్, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ దుర్గాప్రసాద్, ఎంఈఓ నాగేశ్వరరావు, ఏఈలు గుణశేఖర్ రెడ్డి, శ్రీధర్ గురువారెడ్డి, కిషోర్ కుమార్ రామిరెడ్డి, ఏపీఓ కిరణ్, ఏవో చిట్టిబాబు, పలువురు సచివాలయ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నాడు- నేడు పనుల్లో నాణ్యత పాటించండి

జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్ర రావు


నాడు -నేడు పనులను పరిశీలిస్తున్న జిల్లావిద్యాశాఖ అధికారి

ప్రజాశక్తి -యాదమరి: నాడు-నేడు పనుల్లో నాణ్యత పాటించాలని విద్యాశాఖ అధికారి విజయేంద్ర రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొట్టాలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నడిమూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. కొట్టాలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు -నేడు పనులను పరిశీలించారు. పనులు వేగవంతంగా చేపట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాడు -నేడు పనుల్లో భవన నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులుకు సూచించారు. జగనన్న విద్యాశాఖ కానుక పంపిణీ వివరాలు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే నడిమూరు పాఠశాలలో విద్యార్థుల విద్యాసామర్థాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, పాఠశాలలో సెల్ ఫోన్లు ఉపయోగించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రుక్మిణమ్మ, హెచ్ఎం యుసప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళల పట్ల అవగాహన పెంచుకోవాలి

జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు బాలకృష్ణారెడ్డి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: కళల పట్ల అవగాహన పెంచుకోవాలని జిల్లా రచయితల సంఘ అధ్యక్షులు బాలకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో బంగారుపాల్యం మండలానికి చెందిన లీలా మనోహర్ రెడ్డికి కవిత్వంపై సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రాబోవు తరానికి మార్గదర్శకులుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో అడల్ డిప్యూటీ డైరెక్టర్ నాగేశ్వర్ రెడ్డి, ప్రజా సేవా సమితి అధ్యక్షులు రాజారత్నం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రరెడ్డిని పరామర్శించిన జెడ్పీ ఛైర్మన్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం : జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకూర రామచంద్రారెడ్డిని శుక్రవారం పాలేరు ఆయన స్వగృహంలో జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు పరామర్శించి ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మోకాలు, అనారోగ్య కారణాల చేత శాస్త్ర చికిత్స చేసుకోవడంతో ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, మాజీ సర్పంచ్ దొరస్వామి శరత్ రెడ్డి, నాయకులు ప్రవీణ్ రెడ్డి, ప్రభు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ, ప్రభుత్వ పాఠశాలల తనిఖీ


అంగన్వాడీ కేంద్రంలో సర్పంచి, ఎంపీపీ

ప్రజాశక్తి-సోమల : మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను అంగన్వాడీ కేంద్రాలను సర్పంచి భాషా మసూద్, ఎంపీపీ ఈశ్వరయ్యలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యాబోధన వసతులు, మధ్యాహ్న భోజనం, పౌష్టికాహార పంపిణీ తదితర అంశాలను సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందజేయాలన్నారు. పౌష్టికాహార పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా లబ్ధిదారులకు నేరుగా అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల ద్వారా అధిక దిగుబడి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగపద్మిని



ప్రజాశక్తి -రామకుప్పం : రైతులు ఆధునిక పద్ధతుల ద్వారా పంటలు పండిస్తే అధిక దిగుబడితో పాటు ...ఖర్చులు కూడా తగ్గుతాయని తద్వారా రైతులు ఆర్థికంగా ఎదగడానికి సహాయ పడతాయని చిత్తూరు జిల్లా ఆత్మ ట్రైనింగ్ సెంటర్ ఏడీ నాగపద్మిని పేర్కొన్నారు. శుక్రవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 89 పెద్దూరు, ననియాల గ్రామంలో రైతులకు ఆధునిక సేద్యంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రం ద్వారా పంచాయతీ పరిధిలోని రైతులకు వ్యవసాయ మెలకువలు, డ్రం సీడర్ విధానం, భూసార పరీక్షలు, పంటల సంరక్షణ, అధిక దిగుబడి వంటి అంశాలపై సుదీర్ఘంగా రైతులకు తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారిణి అమృత, రైతుభరోసా కేంద్రం సిబ్బంది, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - ఎస్ఆర్‌పురం: మండలంలోని 49కొత్తపల్లి మిట్ట సబ్‌స్టేషన్ పరిధిలోగల సబ్‌స్టేషన్లకు విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఎస్ఆర్‌పురం విద్యుత్ ఏఈ గిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ శనివారం ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగునని తెలిపారు. ప్రజలు, రైతులు, విద్యుత్ అంతరాయ విషయాన్ని గమనించి సహకరించవలసిందిగా కోరారు.

రూ.5లక్షల విలువజేసే..

అక్రమ మద్యం ప్యాకెట్లు ధ్వంసం

ప్రజాశక్తి -పుంగనూరు : వివిధ కేసులలో పట్టుబడ్డ రూ.5 లక్షలు విలువజేసే అక్రమ మద్యం ప్యాకెట్లను ధ్వంసం చేసినట్లు ఎస్ఈబి ఇన్‌స్పెక్టర్ సీతారామరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పుంగనూరు ఎస్ఈబి స్టేషన్ పరిధిలో 81 కేసులలో పట్టుబడిన 1316 లీటర్ల కర్ణాటక మద్యాన్ని, 72 కేసులలో పట్టుబడిన 866 లీటర్ల నాటుసారాను చిత్తూరుకు చెందిన అసిస్టెంట్ ఎన్ఫోర్స్‌మెంట్ సూపరిండెంట్ చంద్ర శేఖర్ నాయుడు సమక్షంలో పుంగనూరు డంపింగ్ యార్డ్ సమీపంలో ధ్వంసం చేసినట్లు తెలిపారు.

అక్రమ రవాణాపై దృష్టి సారించండి

డిఎస్పీ శ్రీనివాసమూర్తి


యాదమరి పోలీస్ స్టేషన్లో సిబ్బందితో సమీక్షిస్తున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి -యాదమరి: మండలంలో ఇసుక అక్రమ రవాణా, నాటు సారా తయారీ, అక్రమ మద్యం రవాణాపై ఉక్కుపాదం మోపాలని డిఎస్పి శ్రీనివాసమూర్తి యాదమరి పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం యాదమరి పోలీస్ స్టేషన్‌ను డిఎస్పీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పలు కేసులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. మండలంలోని తమిళనాడు సరిహద్దు ప్రాంతం కావడంతో అక్రమంగా ఇసుక, గ్రానైట్, ఎర్రచందనం, అసాంఘిక కార్యకలాపాలపై, అక్రమ రవాణాపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మహిళా పోలీసు సంరక్షణ సిబ్బందికి పలు సూచనలు చేశారు గ్రామాలలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు చర్యలు చేపట్టాలని, భూ సమస్యలు, వివాదాలు, అసాంఘిక కార్యకలాపై తక్షణ సమాచారం స్థానిక ఎస్ఐకు అందజేయాలని సూచించారు. సీసీ కెమెరాల పనితీరుపై సిబ్బందిని అడిగి పనిచేసేలా చూడాలని ఆదేశించారు. చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, పోలీసు సిబ్బంది, మహిళా సంరక్షణ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశాఖ ఆధ్వర్యంలో ఎల్‌సిడిసి సర్వే

ప్రజాశక్తి-సోమల : మండలంలోని ఇరికిపెంట పంచాయతీ పార్వతీ నగర్లో సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఎల్‌సిడిసి(కుష్టు వ్యాధి నిర్ధారణ) సర్వేని నిర్వహించారు. కుష్టు వ్యాధి నివారణ వారోత్సవాలలో భాగంగా సూపర్‌వైజర్ రహిమ, ఏఎన్ఎం మదనిక, సిహెచ్ఒ, ఆశా కార్యకర్తలు సర్వే నిర్వహించారు. కందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ పారామెడికల్ అధికారి దేవదాసు హాజరై సిబ్బందికి పలు సూచనలను అందజేశారు. కుష్టు వ్యాధి సాధారణ జబ్బేనని అవగాహన కలిగి ఉండి సరైన సమయంలో వైద్యుల సూచన మేరకు మందులు వాడడం వల్ల వ్యాధి నయమయ్యే అవకాశం ఉందని ఇందుకోసం గ్రామాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి విజయలక్ష్మి, ఎంపి హెచ్ఈఓ కుమార వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ స్టాఫ్‌నర్స్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి



ప్రజాశక్తి-పులిచెర్ల: జిల్లా కలెక్టరేట్ వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 22న నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్షులు నానికేనాయక్, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి భానుప్రకాష్ తెలిపారు. పులిచెర్ల మండలం యూటీఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. అనంతరం కలక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నానికేనాయక్, భానుప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి రావలసిన పెండింగ్ బకాయిలు, తక్షణం చెల్లించాలన్నారు. పీఆర్సీ బకాయిలు గడిచిన 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని, ఏపీ జీఎల్ఐ లోన్లు వెంటనే చెల్లించాలన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు చెల్లించవలసిన డీఏ అరియర్లు చెల్లించినప్పటికీ ఇప్పటివరకు ఖాతాల్లో జమకాకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగుల ఆర్థిక బకాయిల చెల్లింపు సత్వరం చేపట్టాలని కోరుతూ ఉద్యోగ ఉపాధ్యాయులు కలక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ధర్నాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని వారు కోరారు. యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

వారం రోజుల పాటు దగ్గుంటే పరీక్షలు చేసుకోండి

- జిల్లా టీబీ అధికారి డాక్టర్ రవి రాజు



ప్రజాశక్తి-కార్వేటినగరం : ఎవరికైనా వారం రోజులగా దగ్గు ఉంటే తప్పనిసరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గళ్ళ పరీక్ష చేయించుకోవాలని జిల్లా టిబి అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. శుక్రవారం కార్వేటినగరం, శ్రీరంగరాజపురం పిహెచ్‌సిలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ టీబీపై వైద్యాధికారులకు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టాలని వైద్య సిబ్బందికి తెలియజేశారు. ప్రభుత్వం నిర్ణయించిన సమయపాలనను పాటించాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పుట్టిన చిన్నారుల నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు నెమ్ము చేరకుండా ఉండేందుకు ఆరోగ్య కేంద్రాలలో పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. అలా చేస్తే శిశువు మరణాలను తగ్గించవచ్చున్నారు. వైద్య అధికారులు గోపీనాథ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి- కార్వేటినగరం : గ్రంథాలయాలు విజ్ఞాన భాండా గారాలని, యువత గ్రంథాలయాలను వినియోగించుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజియులురెడ్డి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ కళాశాలలో 55వ గ్రంథాలయ వారోత్సవాలను కళాశాల గ్రంథాలయ అధికారి అస్వశగన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను వినియోగించుకుని పోటీ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. అలాగే ఉన్నత విద్యను అభ్యసించే వారికి సైతం గ్రంథాలయాలు చాలా అవసరమని గుర్తు చేశారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన కార్వేటినగరం గ్రంథాలయ అధికారి శంకర్ బాబును డిగ్రీకళాశాల అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలసుబ్రమణ్యం ఆచారి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



ప్రజాశక్తి-రామకుప్పం: నిరుపేద మహిళలు అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని వైసిపి మండలాధ్యక్షుడు బాబు రెడ్డి, జెడ్పిటిసి నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శుక్రవారం మండల శివార్లలోని శ్రీశక్తి భవనం వద్ద మహిళా సంఘ సభ్యులకు 11 నాటుకోళ్ల పెంపక విత్తనాలను పంపిణీ చేశారు. నూరు మంది కుటుంబాలకు అందించి కోళ్ల పెంపకంతో ఆర్థికంగా ఎదగాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వంలో పౌష్టికాహార లోపం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో -కన్వీనర్ చంద్ర రెడ్డి, సర్పంచ్ మురళి, పంచాయతీ అధ్యక్షుడు అప్పి, వెలుగు ఏపీఎం లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కనువిందుగా వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం

ప్రజాశక్తి-సోమల : సోమల మండలం నెల్లిమంద పంచాయతీ బురుజు పల్లి గ్రామంలో వెలిసిన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం భక్తులను కనువిందు చేసింది. స్వామివారి షష్టిమ(ఆరవ) కళ్యాణోత్సవంలో భాగంగా రెండు రోజులుగా స్వామివారికి ప్రత్యేక పూజ అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం స్వామివారి మూల విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు కళ్యాణ వేదిక వద్ద శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇదే సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు స్వామివారి కీర్తనలను ఆలపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.